సాక్షి
ఏలూరు
బుధవారం | 25 | జనవరి | 2023



కిటకిటలాడిన మద్ది

జంగారెడ్డిగూడెం రూరల్: మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.



ఆకట్టుకున్న నాటకం

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ వార్షికోత్సవాల్లో మంగళవారం శ్రీమావుళ్లమ్మ నాట్యమండలి ప్రదర్శించిన పంచరత్నాలు నాటిక ప్రేక్షకులను అలరించింది.



వర్గీకరణను వ్యతిరేకించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకమని బీజేపీ ప్రకటన చేయాలని కేంద్ర మంత్రి భారతీ ప్రవీణ్‌ను మాల మహానాడు అధ్యక్షుడు మంగరాజు కోరారు.

న్యూస్‌రీల్

బాలరాజును పరామర్శించిన కలెక్టర్



రాజమండ్రిలో ఎమ్మెల్యే బాలరాజు ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

బుట్టాయగూడెం: తీవ్ర అస్వస్థతకు గురై రాజమండ్రి ఐసీయూలో వైద్యం పొందుతున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజును మంగళవారం సాయంత్రం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పరామర్శించారు. ఎమ్మెల్యే బాలరాజు అస్వస్థతకు గురైనట్లు తెలుసుకున్న కలెక్టర్ హుటాహుటిన రాజమండ్రి వెళ్ళారు. ఆస్పత్రికి చేరుకుని ఎమ్మెల్యే బాలరాజును పరామర్శించడంతో పాటు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వైద్యులను బాలరాజు ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే అస్వస్థతకు గురైన సమాచారంతో వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, కారం వెంకటరమణ, దినేష్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజమండ్రి తరలివెళ్ళారు.

ఆళ్ల నాని పరామర్శ

ఏలూరు టౌన్: తెల్లం బాలరాజును ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఫోన్‌లో పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పొగాకు సాగులో రసాయనాలు వాడొద్దు



ముప్పినవారిగూడెంలో పొగాకును పరిశీలిస్తున్న పొగాకు బోర్డు ఆర్‌ఎం

బుట్టాయగూడెం: పొగాకు సాగులో పురుగు మందులు, అవశేషాలు లేకుండా పండించిన పంటలకు మాత్రమే అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గుర్తింపు ఉంటుందని పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ జీఎల్‌కె ప్రసాద్ అన్నారు. మండలంలోని దొరమామిడి, ముప్పినవారిగూడెం, కోటనాగవరం గ్రామాల పరిధిలో మంగళవారం పొగాకు బోర్డు అధికారుల బృందం పొగాకు తోటలను, బేరన్లను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. క్యూరింగ్, గ్రేడింగ్‌లను పరిశీలించారు. గ్రేడింగ్ చేసేటప్పుడు, మండె వేసేటప్పుడు తడిలేకుండా చూసుకోవాలని అన్నారు. చెక్కులు తొక్కే సమయంలో స్ప్రే చేయకుండా చెక్కులు తొక్కాలని అన్నారు. పంటల పరిశీలన సమయంలో నల్లమచ్చ, పొటాషియం లోపాలను గుర్తించిన అధికారులు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఆక్షన్ సూపరింటెండెంట్ బి.శ్రీహరి, ఎస్‌జీఓ కె.శ్రీధర్, ఐటీసీ కంపెనీ ప్రతినిధి చారువాక, జీపీఐ కంపెనీ రవి, వీఎస్ఎస్ కంపెనీ నరేంద్ర, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ ప్రోత్సాహం




నూజివీడులో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పరిశ్రమల కేంద్రం జీఎం పీ.ఏసుదాసు

నూజివీడు: ప్రస్తుత పరిస్థితుల్లో నిరుద్యోగ సమస్యకు పరిష్కారంగా పరిశ్రమలను నెలకొల్పేందుకు యువత ముందుకు వస్తే ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు పి.ఏసుదాసు చెప్పారు. మంగళవారం నూజివీడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుదాసు మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు అనుమతుల కోసం సింగిల్ డెస్క్ పోర్టల్‌లో దరఖాస్తు చేస్తే 21 రోజుల లోపు అనుమతులు లభిస్తాయన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రుణాలను సక్రమంగా తిరిగి చెల్లిస్తే వారి సిబిల్ రేటు పెరుగుతుందన్నారు. ఏపీ ఎస్ఎఫ్‌సీ ఏలూరు డిప్యూటీ మేనేజర్ శ్రీనివాసరావు పరిశ్రమల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ సుమధురవాణి, ఎంపీడీవో సుందరి, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ నాగేంద్ర భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ పొడిగింపుతో దళితులకు న్యాయం

- ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ గడువు పొడిగింపుపై సర్వత్రా హర్షాతిరేకాలు
- గడువు కంటే ముందే మరో పదేళ్లు పొడిగిస్తూ జీఓ విడుదల
- సీఎం వైఎస్ జగన్ చేతల వ్యక్తి అని మరోమారు రుజువు

ఏలూరు (టూటౌన్): పేదల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటూ దళిత, ఆదివాసీ సంఘాల నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కాలపరిమితి ఈ నెల 24వ తేదీతో ముగియనుండటాన్ని గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీనిని మరో పదేళ్లు పొడిగిస్తూ ఈ నెల 22న ఆర్డినెన్స్ ద్వారా జీవో నంబర్ 7ను విడుదల చేశారు. దీంతో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల సంఘాల నాయకులు, మేధావులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేవలం మాటల మనిషి కాదని, చేతల మనిషి అని మరోసారి రుజువు అయిందని చెబుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రి ఎస్.కిరణ్‌కుమార్‌రెడ్డి 2013లో ఈ సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసుకువచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా, సామాజికంగా, విద్య, ఉపాధి పరంగా ముందడుగు వేయడానికి ఊతంగా ఉంటుందనే ఉద్దేశంతో తెచ్చిన ఈ చట్టం కాలపరిమితి ఈ నెల 24తో ముగియనుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు దళిత, గిరిజన సంఘాల నాయకులు, ఉద్యోగులు, మేధావులు దీనిని శాశ్వతంగా అమలు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖలు రాశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మంత్రులు, సమావేశాల ద్వారా విజ్ఞప్తులు చేశారు. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గడువుకు రెండు రోజులు ముందుగానే ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా జీవో విడుదల చేశారు. దీని ప్రకారం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం కాలపరిమితి మరో పదేళ్లపాటు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయం ఆయా వర్గాల్లో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, ప్రజలు ధన్యవాదాలు చెబుతున్నారు.



GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

ORDINANCES - STATE - The Andhra Pradesh Scheduled Castes Sub-Plan and Tribal Sub-Plan (Planning, Allocation and Utilization of Financial Resources) (Amendment) Ordinance, 2023. Publication ordered as Andhra Pradesh Ordinance No. 1 of 2023.

LAW (I) DEPARTMENT

G.O.Ms.No.7 Dated: 23rd January, 2023.

ORDER:

The Andhra Pradesh Scheduled Castes Sub-Plan and Tribal Sub-Plan (Planning, Allocation and Utilization of Financial Resources) (Amendment) Ordinance, 2023, will be published in the Andhra Pradesh Gazette in English, Telugu and Urdu languages as Andhra Pradesh Ordinance No.1 of 2023.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF ANDHRA PRADESH)

Secretary to Government,
Legal and Legislative Affairs & Justice,
Law Department.

APPENDIX

The following is the authoritative text in English language of the Ordinance promulgated by the Governor on the 22nd January, 2023, being published under article 348 (3) of the Constitution of India for general information:

(Here enter the Ordinance enclosed)

The Andhra Pradesh Scheduled Castes Sub-Plan and Tribal Sub-Plan (Planning, Allocation and Utilization of Financial Resources) (Amendment) Ordinance, 2023.

To,
The Commissioner of Printing,
A.P. Legislative Assembly Printing Press, Amaravati,
The Director of Translations, A.P.,
The Social Welfare Department.
The Tribal Welfare Department.
The Secretary to Legislature, A.P. Legislative (Assembly) Department, Velagapudi, Amaravati.
The Secretary to Governor, Raj Bhavan, Vijayawada.

సబ్‌ప్లాన్ జీవో కాపీ

సీఎంకు అభినందనలు



రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల మనసెరిగి సబ్‌ప్లాన్ చట్టం గడువు మరో పదేళ్లు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అభినందనలు. జనాభా ప్రాతిపదికన రాష్ట్ర బడ్జెట్లో కేటాయించిన నిధులను ఆయా వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం వినియోగించాలి. దీని అమలులో నిర్లక్ష్యం వహించే అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, ఐవైఐఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి

అమలు తీరు పరిశీలించాలి



ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం అమలు చేయని అధికారులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ముఖ్యమంత్రి లక్ష్యం నెరవేరేవిధంగా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాలి. అప్పుడే సబ్‌ప్లాన్ చట్టం అసలు లక్ష్యం నెరవేరుతుంది. జిల్లా స్థాయిలో కమిటీలు వేసి ప్రతి మూడు నెలలకు ఒకసారైనా దీని అమలు విధానాలపై పరిశీలన చేయాలి.

– కొరబండి బాబూరావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి, దళిత మహాసభ

చేతల మనిషి వైఎస్ జగన్



సీఎం వైఎస్ జగన్ చేతల మనిషి అని మరోసారి రుజువు చేశారు. ఎస్సీ, ఎస్టీలు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రంగాల్లో ఊతం ఇచ్చేందుకు నిర్దేశించిన సబ్‌ప్లాన్ చట్టాన్ని మరో 10 సంవత్సరాలు పొడిగించడం గొప్ప విషయం. వచ్చే ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలు అంతా వైఎస్సార్ సీపీని బలపర్చి మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ ఎన్నికయ్యేలా కృషి చేయాలి.

– పల్లా యేసేబు, ఎస్సీ హక్కుల పరిరక్షణ సంఘం నేత

శుభపరిణామం



ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ గడువు మరో పది సంవత్సరాలు పొడిగించడం ఎంతో శుభ పరిణామం. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలు అందరూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఎంతో రుణపడి ఉంటాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీలపై తనకున్న ప్రేమను మరోసారి రుజువు చేసుకున్నారు. సబ్‌ప్లాన్ ద్వారా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించనుండటం ఎంతో సంతోషదాయకం.

– పల్లెం ప్రసాద్, డైరెక్టర్, ఏపీ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్

సీఎంకు ధన్యవాదాలు



సబ్‌ప్లాన్ చట్టాన్ని మరో 10 సంవత్సరాలు పొడిగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు. దీన్ని శాశ్వతంగా అమలు చేయాలని, అలా కుదరని పక్షంలో గడువును పొడిగించాలని కోరుతూ దళిత, గిరిజన బడ్జెట్ వాచ్ పక్షాన జిల్లాలో అనేక కార్యక్రమాలు నిర్వహించాం. ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రభుత్వాధికారులకు వినతులు అందించాం. సానుకూలంగా స్పందించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– సింగవరపు జ్యోతి, జిల్లా కన్వీనర్, దళిత, గిరిజన బడ్జెట్ వాచ్

పేదల పెన్నిధి వైఎస్ జగన్



రాష్ట్రంలోని పేదల పెన్నిధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం నిర్దేశించిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం గడువును మరో 10 సంవత్సరాలు పొడిగించడం ద్వారా తన ఔన్నత్యాన్ని చాటుకున్నారు. మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా రావాలి. ఆయన్ను రాబోయే ఎన్నికల్లో గెలిపించేందుకై దళిత క్రిస్టియన్లు పెద్ద ఎత్తున కృషి చేయాల్సిన అవసరం ఉంది.

– పెరికె వరప్రసాదరావు, అధ్యక్షుడు, ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్

సైబర్ నేరాల అదుపుపై ఆన్‌లైన్ శిక్షణ



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

ఏలూరు టౌన్: సైబర్ నేరాల దర్యాప్తుపై పోలీసు సిబ్బందికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్‌డివిజన్ పరిధిలోని డీఎస్పీలు, సీఐలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆన్‌లైన్ శిక్షణలో రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ కిషోర్, డాక్టర్ ఉదయ్‌శంకర్ పురనిక్, డాక్టర్ ప్రొఫెసర్ వివేకానంద సైబర్ నేరాల దర్యాప్తుపై శిక్షణ ఇచ్చారు. డాక్టర్ ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ సోషల్ మీడియా వినియోగించే విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని, నేరాల దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ నేరస్తులను పట్టుకోవాలన్నారు. అంతర్జాతీయ ఉగ్రవాదుల సంస్థలకు సైతం నేటి సాంకేతిక పరిజ్ఞానం సాయం చేస్తోందని, ఈ క్రమంలో సైబర్ నేరాలను అదుపు చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు చట్టాల్లోని లోపాలను వినియోగించుకుని దాడులకు పాల్పడుతున్నారని, వాటిని అడ్డుకునేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో మెళకువలు నేర్చుకోవాలన్నారు.

పశువైద్య వాహనాల మంజూరు

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లాకు కొత్తగా మరో ఆరు వైఎస్సార్ సంచార పశువైద్య ఆరోగ్య సేవా వాహనాలు మంజూరైనట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో జిల్లాకు ఏడు వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనాలు అందించామన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్షలు



ఏలూరు సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులను థర్మల్ స్కానర్‌తో చెక్ చేస్తున్న సిబ్బంది

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జేఈఈ మెయిన్స్ పరీక్షలు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ఎంపిక చేసిన కేంద్రాల్లో మంగళవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఒక సెషన్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఒక సెషన్‌లో పరీక్షలు నిర్వహించారు. ఈ రెండు జిల్లాల్లోని 4 పరీక్షా కేంద్రాల్లో తొలిరోజు మొత్తం 1,128 విద్యార్థులకు గాను 1121 మంది హాజరయ్యారు. ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షల్లో ఉదయం తొలి సెషన్‌లో 144 మందికి 142 మంది హాజరు కాగా, సాయంత్రం రెండో సెషన్‌లో మొత్తం 144 మంది హాజరయ్యారు. తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం సెషన్‌లో 220 మందికి 220 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 220 మందికి 219 మంది హాజరయ్యారు. తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం సెషన్‌లో 99 మందికి 97 మంది, మధ్యాహ్నం సెషన్‌లో మొత్తం 100 మంది హాజరయ్యారు. భీమవరం డీఎన్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం సెషన్‌లో 101 మందికి 99 మంది హాజరు కాగా మధ్యాహ్నం సెషన్‌లో మొత్తం 100 మంది హాజరయ్యారు.

విద్యార్థులకు అన్యాయం జరిగితే ఊరుకోం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రామమోహన్‌రావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

నూజివీడు: పట్టణంలోని కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేషన్ కాలేజీలో అనలైటికల్ కెమిస్ట్రీకి చెందిన 33 మంది విద్యార్థులకు యూనివర్సిటీ న్యాయం చేయాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు డిమాండ్ చేశారు. పీజీ కేంద్రం విద్యార్థులకు అన్యాయం జరిగినా, పీజీ కేంద్రాన్ని నిర్వీర్యం చేయాలని చూసినా ఊరుకోనన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే మంగళవారం స్థానిక పీజీ సెంటర్‌కు వెళ్లి విద్యార్థుల సమస్యపై ప్రిన్సిపాల్ ఆచార్య వెంకట రాముతో చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ 2020-22 విద్యాసంవత్సరంలో తమకు ప్రాజెక్టు వర్కు ఉండాలని కోర్టుకు వెళ్లామని, అయితే కోర్టు ఆర్గానిక్ కెమిస్ట్రీ విద్యార్థులకు ప్రాజెక్టు వర్కు చేయమని మధ్యంతర ఉత్తర్వులిచ్చిందని, అనలైటికల్ కెమిస్ట్రీకి చెందిన విద్యార్థుల విషయంలో యూనివర్సిటీ నిర్ణయం తీసుకోవాలని పేర్కొందన్నారు. దీంతో కెమిస్ట్రీ విద్యార్థులు ప్రాజెక్టు వర్కుకు వెళ్లగా, తమను కూడా వెళ్లమంటూ కెమిస్ట్రీ ప్రొఫెసర్ బసవేశ్వరరావు ఒత్తిడి చేసి పంపించారన్నారు. దీంతో 4వ సెమిస్టర్ పరీక్షలు రాయలేకపోయామని, పరీక్ష రాయడానికి సిద్ధమవగా ప్రొఫెసర్ బసవేశ్వరరావు పరీక్ష రాస్తే మార్కులు వేసేది లేదంటూ బెదిరించడంతో భయంతో పరీక్షకు హాజరవలేదన్నారు. దీంతో ఇప్పటికే 8 నెలలు వృథాగా గడిచిపోయాయని వాపోయారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం ఒక ప్రొఫెసర్ వల్ల విద్యార్థులు నష్టపోయారని కోర్టు కేసులంటూ విద్యార్థులను తప్పుదోవ పట్టించారన్నారు. వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పీజీ కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు తాను కృషి చేస్తుంటే ఇలాంటి సంఘటనల వల్ల విద్యార్థులు ఎలా చేరతారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రతాప్ కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కే.రామ్మోహన్ రావు, రిజిస్ట్రార్ ఎం.రామిరెడ్డితో ఫోన్‌లో ఈ విషయమై మాట్లాడటంతో తాము పీజీ కేంద్రానికి వస్తున్నామని తెలిపారు. వారిరువురూ వచ్చిన తరువాత ఎమ్మెల్యే వారికి విషయాన్ని వివరించారు. వైస్ చాన్సలర్ విద్యార్థులను అడిగి సమస్య తెలుసుకున్నారు. విద్యార్థులకు తప్పకుండా న్యాయం చేస్తామని, వారు కోర్సు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కు హామీ ఇచ్చారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలి



విద్యార్థినులకు బహుమతులు అందజేసిన డీఎంహెచ్‌ఓ నాగేశ్వరరావు తదితరులు

ఏలూరు(మెట్రో): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ బాలికా దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.నాగేశ్వరరావు, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో–ఆర్డినేటర్, ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా.మానస పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలని, తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ మానస మాట్లాడుతూ బాలికలు ఉన్నత చదువులు చదివి గొప్ప పదవులు అధిరోహించాలన్నారు. సమాజంలో ఆడ పిల్లలు పట్ల వివక్ష ఉండరాదన్నారు. వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరచిన 9 మంది బాలికలకు బహుమతులు అందజేశారు. వ్యాసరచన పోటీల్లో శనివారపుపేట జెడ్పీ పాఠశాలకు చెందిన నూరు సుమయ, సత్రంపాడు జెడ్పీ పాఠశాలకు చెందిన వి.గీతిక, గణపవరం మండలం పిప్పర జెడ్పీ పాఠశాలకు చెందిన ఎం.ధాన్యదీపిక గెలుపొందారు. వక్తృత్వ పోటీల్లో సత్రంపాడు జెడ్పీ పాఠశాలకు చెందిన వి.గీతిక, పిప్పర జెడ్పీ పాఠశాలకు చెందిన ఐ.గాయత్రి నాగకుసుమ, శనివారపుపేట జెడ్పీ పాఠశాలకు చెందిన భవ్య బహుమతులు పొందారు. డ్రాయింగ్ పోటీల్లో గణపవరం జెడ్పీ పాఠశాలకు చెందిన ఎస్.షమిత, శనివారపుపేట జెడ్పీ పాఠశాలకు చెందిన జి.ప్రణవి, డి.ప్రియాంక బహుమతులు పొందారు.

27న జాబ్ మేళా

ఏలూరు (టూటౌన్): ఈ నెల 27న ఏలూరులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు. డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో డిప్లమో ఇంజినీర్ ట్రైనీ కోసం ఉదయం 10.30 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలో మొత్తం 350 ఖాళీలకు సంబంధించి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. పాలిటెక్నిక్ ఇఇఇ, ఇసీఈ, మెకానికల్ చదివి, 2020-21, 2021-22 విద్యాసంవత్సరాల్లో ఉత్తీర్ణులైన యువత పాల్గొనవచ్చని తెలిపారు. వయస్సు 18 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. 88868 82032, 95022 66121 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కలెక్టర్‌కు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డు



పి.ప్రశాంతి, పశ్చిమ గోదావరి కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమ కలెక్టర్ పి.ప్రశాంతి రాష్ట్ర ఎన్నికల కమిషన్ అందించే బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డుకు ఎంపికైనట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం తెలిపారు. అవార్డును 13వ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అందజేస్తారు. ఓటరు చైతన్య కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసినందుకు, అత్యధిక ఓటర్లను నమోదు చేసినందుకు రాష్ట్రంలో ఎంపిక చేసిన ముగ్గురు కలెక్టర్లలో ప్రశాంతి ఉండటం గమనార్హం.

గడపగడపకు సంక్షేమం



గణపవరం: మండలంలోని అప్పన్నపేటలో వృద్ధురాలికి నవరత్నాల బ్రోచర్ అందచేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు



ఆగిరిపల్లి: మండలంలోని నెక్కలం గొల్లగూడెంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

కొయ్యలగూడెం వాసికి అరుదైన పురస్కారం



నిడదవోలు వినయ్‌రామ్

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంకు చెందిన నిడదవోలు వినయ్‌రామ్ అరుదైన పురస్కారానికి ఎంపికయ్యారు. మోస్ట్ ఇన్‌స్పైరింగ్ గ్రీన్ ఎంట్రిప్రెన్యూర్ రంగానికి సంబంధించి చేసిన విశేష కృషికి గాను ఢిల్లీలో కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరి చేతుల మీదుగా బుధవారం తాను ఈ పురస్కారం అందుకోనున్నట్లు వినయ్ మంగళవారం స్థానిక విలేకరులకు ఫోన్ ద్వారా తెలిపారు. వినయ్ సాధారణ కుటుంబానికి చెందిన వ్యక్తి కాగా, అంచెలంచెలుగా ఎదుగుతూ హైదరాబాదులో స్థిరపడ్డారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో సుమారు 1000 ఎకరాల విస్తీర్ణంలో ఆహార పంటలను పండిస్తున్నారు. ఈ సందర్భంగా వినయ్ తండ్రి నిడదవోలు రామారావును గ్రామస్తులు అభినందించారు.

కవితా పోటీల విజేతలు వీరే

సాక్షి, భీమవరం: మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సర్వోదయ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కవితా రచనల పోటీల విజేతల వివరాలను జిల్లా సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు మంగళవారం విడుదల చేశారు. గాంధేయం–నవ భారతం అనే అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి కవితా రచనల పోటీల్లో 17 మందిని ఎంపిక చేశామని తెలిపారు. తెన్నేటి లక్ష్మీ నర్సింహమూర్తి (పాలకోడేరు), వేమూరి శ్రీనివాస్ (తాడేపల్లిగూడెం), వెంకటలక్ష్మి (ఏలూరు), గుండాల మహాలక్ష్మి (ములపర్రు), మీసాల సూర్యనారాయణ (పెద అమిరం), చివటం సుబ్బారావు (పెనుగొండ), సీఎస్ శాస్త్రి (నరసాపురం), గండి సుధాకర్ (భీమవరం), ఎం.అదృష్టబాబు (వేగవరం), షేక్ అల్లీ సాహెబ్ (ఏలూరు), వీఎస్‌వీ ప్రసాద్ (తణుకు), యండపల్లి పాండురంగ (గణపవరం), ఉప్పులూరు స్వర్ణకుమార్ (భీమవరం), దంతులూరి శ్రీరామకృష్ణంరాజు (తాడేపల్లిగూడెం), వి.అప్పారావు (ఏలూరు), జి.శేషేంద్ర రావు (ధవళేశ్వరం), గంధం సాహితి (అత్తిలి) ఎంపిక చేశామన్నారు. వీరికి 30వ తేదీన చాగల్లు మండలం మల్లవరంలోని గాంధీ స్మారక కేంద్రంలో పురస్కారాలు, బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

క్రీడల్లో రాణిస్తూ.. జాతీయ స్థాయికి



జంగారెడ్డిగూడెంలో విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

జంగారెడ్డిగూడెం: ఉమ్మడి జిల్లాలోని పలువురు విద్యార్థులు క్రీడల్లో విశేషంగా రాణిస్తూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై సత్తా చాటుతున్నారు. జంగారెడ్డిగూడెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు అండర్–19 విభాగంలో పలు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ పి.అరుణ చెప్పారు. మంగళవారం గురుకులంలో విద్యార్థినుల అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. డిసెంబర్ 28, 29 తేదీల్లో కడపలో నిర్వహించిన 66వ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో గురుకులానికి చెందిన ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని పి.ప్రియాంక, ఈ నెల 11, 12 తేదీల్లో పెదవేగిలో నిర్వహించిన బేస్‌బాల్ పోటీల్లో కె.రమ్య, టి.సునీత, కె.రాజ్యలక్ష్మి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అలాగే రెజ్లింగ్ పోటీల్లో స్టాండ్‌బైగా కె.భవానీ ఎంపికైందన్నారు. విద్యార్థినులను, పీడీ కె.విజయలక్ష్మి, పీఈటీ కె.వెంకటలక్ష్మిలను ప్రిన్సిపాల్ పి.అరుణ, వైస్ ప్రిన్సిపాల్ సుజాత అభినందించారు.

అండర్–14లో ఫుట్‌బాల్ పోటీలకు..

తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లి జెడ్పీ హైస్కూలు తొమ్మిదో తరగతి విద్యార్థిని చిటికిన మోహిత పూర్ణ జాతీయ స్థాయి అండర్–14 బాలికల ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. రాష్ట్ర స్థాయిలో భారతీయ విద్యాభవన్స్‌లో జరిగిన ఫుట్‌బాల్ ఎంపిక పోటీల్లో మోహిత ప్రతిభ కనబర్చింది. మంగళవారం స్కూలు ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. మోహితను సర్పంచ్ పోతుల అన్నవరం, సొసైటీ చైర్మన్ పరిమి తులసీదాస్, హెచ్ఎం షేక్ లాల్ బీబీ, ఎస్ఎంసీ చైర్మన్ బి.వెంకటేశ్వరరావు, పీడీ ప్రసాద్ అభినందించారు.



మోహితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



కిక్ బాక్సింగ్ పోటీల దృశ్యం

కిక్ బాక్సింగ్‌లో వర్సిటీ తరఫున..

పెంటపాడు: తాడేపల్లిగూడెంలోని నన్నయ వర్సిటీ క్యాంపస్‌లో మంగళవారం వర్సిటీ స్థాయి కిక్ బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. రెండు జిల్లాలకు సంబంధించి పలు కళాశాలల విద్యార్థులు, విద్యార్థినులు హాజరు కాగా, వీరిలో మహిళలు, పురుషుల నుంచి 20 మంది చొప్పున ఎంపిక చేసి పోటీలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో పురుషుల నుంచి ముగ్గురు, మహిళల నుంచి ముగ్గురిని ఎంపిక చేశారు. ఫిబ్రవరి 15 నుంచి 19వ తేదీ వరకు హరిద్వార్‌లో జరిగే కిక్ బాక్సింగ్ పోటీల్లో వీరు పాల్గొంటారని వర్సిటీ క్రీడల కార్యదర్శి బి.రామ్‌గోపాల్ చెప్పారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

పురుషులలో వై.పాల్ ప్రఫుల్, జె.ఓంకార్, జీవీవీ మణికంఠ, మహిళలలో ఎన్.సాయిజానకి, పి.సాయి తన్మయి, డి.హర్షప్రియ ఎంపికయ్యారు. రిజిస్ట్రార్, ప్రొఫెసర్ టి.అశోక్, కో–ఆర్డినేటర్ కె.సుబ్బారావు, వర్సిటీ క్యాంపస్ సిబ్బంది పాల్గొన్నారు.

8 లీటర్ల న్యూట్రల్ ఆల్కహాల్ స్వాధీనం



నిందితుడు, ట్యాంకర్, ఆల్కహాల్ బాటిళ్లతో ఎస్ఈబీ అధికారులు

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెం ఎస్ఈబీ చెక్‌పోస్ట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్, ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ ఎస్.మణికంఠా రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నుంచి ఏపీలోకి వచ్చే వాహనాలను చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేస్తుండగా మెదక్ నుంచి జార్ఖండ్‌కు వెళుతున్న ట్యాంకర్ లారీలో అక్రమంగా రవాణా చేస్తున్న ఎనిమిది లీటర్ల ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్‌ను స్వాధీనం చేసుకుని, ట్యాంకర్ డ్రైవర్ శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ సోదాల్లో వీఆర్ఓ కొండేటి బుల్లబ్బులు, వీఆర్ఏ షేక్ సతాబి, చెక్‌పోస్ట్ సిబ్బంది డి.ప్రవీణ్‌కుమార్, ఎస్కే షాను బాబు, ఎన్.జగదీష్ బాబు పాల్గొన్నారు.

వాలీబాల్ రాష్ట్ర స్థాయి టోర్నీ ప్రారంభం



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: గవరవరంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను సర్పంచ్ ఎస్ఆర్ఆర్ నరసింహరాజు, సురక్ష హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కొండముది దిలీప్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24, 25, 26 తేదీలలో డాక్టర్ చింతామణి ఆయుర్వేద హాస్పటల్ ఎదురుగా ఉన్న ప్రాంగణంలో పోటీలు కొనసాగుతాయన్నారు. విజేతగా నిలిచిన జట్టుకు రూ.20 వేలు, రన్నర్స్ జట్టుకు రూ.10 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5 వేల నగదు బహుమతులు అందజేస్తామన్నారు. రాజా రాఘవరాజు జయబాబు క్రీడా సామగ్రిని అందజేస్తున్నట్లు తెలిపారు. గోపిన చిన్నికృష్ణ, యాగంటి హరిబాబు, గూడపాటి శ్రీహర్ష, నల్లూరి గోపి, కాకరపర్తి రామారావు సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

చేతివృత్తిదారులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి



చేతి వృత్తిదారుల జిల్లా సదస్సులో భాగంగా రాష్ట్ర సదస్సు కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): చేతి వృత్తిదారులకు రాష్ట్ర బడ్జెట్లో జనాభా ప్రాతిపదికన రూ.52 వేల కోట్లు కేటాయించి కచ్చితంగా వృత్తిదారుల అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చు చేయాలని ఏపీ మత్స్యకార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక అగ్రహారంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో చేతివృత్తిదారుల జిల్లా సదస్సు ప్రత్తిపాటి రామకృష్ణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి వృత్తిదారునికి కుటుంబ సంక్షేమం కోసం రూ.25 వేలు ఆర్థిక సహకారం అందించాలని, ప్రతి కుటుంబానికీ నెలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా మంజూరు చేయాలన్నారు. వృత్తి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన వృత్తిదారుని కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. వృత్తిదారులకు ఫెడరేషన్లు, కార్పొరేషన్లకు నిధులు నిర్ణయించి, నిధులు కేటాయించి ఖర్చు చేయాలన్నారు. మత్స్యకారుల జీవితాలను ధ్వంసం చేసే జీవో 217ను రద్దు చేయాలని, జీవో నెం.343 ప్రకారం పంచాయతీ చెరువులు స్థానిక మత్స్యకారుల సొసైటీలకు నామమాత్రపు లీజుకు ఇవ్వాలన్నారు. చేపల వేట నిషేధ భృతిని రూ.20 వేలకు పెంపుదల చేయాలని కోరారు. జగనన్న చేదోడు పథకం వృత్తిదార్లు అందరికీ ఇవ్వాలన్నారు. చేనేతపై జీఎస్టీని రద్దు చేయాలని, ప్రతి చేనేత కార్మికునికి నేతన్న నేస్తం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 30న విజయవాడలో నిర్వహించే చేతివృత్తిదారుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సదస్సులో చేతివృత్తిదారుల జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చందనాడ నందేశ్వరరావు, యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, ఏపి గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం ఏలూరు నగర కార్యదర్శి కొత్తల శివకుమార్, ఏపీ కల్లుగీత కార్మిక సంఘం ఏలూరు నగర కార్యదర్శి సొంటి శంకర్రావు, మల్లిపూడి రాజు, పి.నాంచారయ్య పాల్గొన్నారు.

జగన్ హయాంలోనే కొల్లేరు గ్రామాల అభివృద్ధి



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొఠారు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే కొల్లేరు గ్రామాలను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తామని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. మంగళవారం ఏలూరు మండలం గుడివాకలంకలో ఆయన పర్యటించారు. ప్రభుత్వం రూ.4 కోట్లతో అభివృద్ధి చేయనున్న కొల్లేరు రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అబ్బయ్య చౌదరి మాట్లాడారు. కొల్లేరు గ్రామాల ప్రధాన రహదారి అభివృద్ధికి ప్రభుత్వం రూ.కోట్లు మంజూరు చేయడం మంచి పరిణామం అన్నారు. ఈ నిధులతో మాధవాపురం నుంచి గుడివాకలంక, కొక్కిరాయిలంక, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు వరకు రోడ్డు నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే రూ.25 కోట్లతో చేపట్టిన కైకలూరు రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు.

భూమి హక్కు కల్పించండి

కొల్లేరు ప్రజలు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములకు శాశ్వత భూహక్కు కల్పించాలని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, మాజీ ఎంపీపీ జయమంగళ రామారావు, పార్టీ కొల్లేరు నాయకులు పల్లెం ప్రసాద్, ముంగర సంజీవ్‌కుమార్, తేరా ఆనంద్, గుడివాకలంక ఉపసర్పంచ్ రుక్మానందమహరాజ్ ఎమ్మెల్యేకి వినతిపత్రం అందించారు. ప్రత్తికోళ్లలంక సర్పంచ్ ఘంటసాల మహరాజు చేసిన విజ్ఞప్తిపై ఎమ్మెల్యే స్పందిస్తూ కొల్లేరు గ్రామాలకు ఎమ్మెల్సీ కేటాయిస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నెరవేరేలా కృషి చేస్తానన్నారు. తొలుత దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

చిరు ధాన్యాలతోనే పోషకాలు

తాడేపల్లిగూడెం: వరి, గోధుమలకు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలను తీసుకుంటూ సరైన పోషకాలను, పీచు పదార్థాలను మన ఆహారంలో ఉండేలా చూసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఉద్యాన యూనివర్సిటీ ఉపకులపతి టి.జానకీరామ్ చెప్పారు. 2023ను అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన సందర్భంగా మంగళవారం ఉద్యాన వర్సిటీలో నిర్వహించిన వెబినార్‌లో వక్తలు మాట్లాడారు. ఈ సందర్భంగా వీసీ టి.జానకీరామ్ మాట్లాడుతూ చిరు ధాన్యాలలో అన్ని రకాలైన విటమిన్లు, పోషకాలు పుష్కలంగా ఉన్నాయని, విశ్వవిద్యాలయ హాస్టళ్ల మెనూలో కూడా విద్యార్థులకు చిరు ధాన్యాలు అందించేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా మిల్లెట్స్ క్యాలండర్‌ను ఉపకులపతి ఆవిష్కరించారు. ఐఐఎంఆర్ సీపీ.రత్నావతి మాట్లాడుతూ చిరు ధాన్యాల సాగులో వివిధ విధానాలు, అధిక దిగుబడినిచ్చే రకాలు, దానికి అవసరమైన ఉపకరణాలు ఔత్సాహిక రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ హార్టీకల్చర్ పద్మావతమ్మ, ఎల్.నారం నాయుడు, ఈ.కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.